క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయండి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమాదేవి

బోనకల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రమాదేవి సూచించారు. మండలంలోని తూటికుంట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం ఆమె పరిశీలించారు. ఎన్యూమరేటర్లు సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా పారదర్శకంగా చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 80శాతం సర్వే పూర్తి అయిందని మరో 20శాతం రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గెలుచుకున్న బహుమతులతో విద్యార్థులు

కొణిజర్ల: ఖమ్మం నగరంలోని షైన్ ఇండియా స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో కొణిజర్ల మండల కేంద్రంలోని సమత సూపర్‌జెమ్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన గండమాల ఆరాధ్య జూనియర్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కొణతం ఉమాశంకర్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏన్కూరు: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మండల కార్యదర్శి ఆనందరావు

బోనకల్: సీపీఐ ఆవిర్భవించి నూరుసంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30న మధ్యాహ్నం 2 గంటలకు నల్గొండలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలంలో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై సభలో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తూము రోషన్‌కుమార్, ఆకెన పవన్, ఏనుగు రవికుమార్, జక్కుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమశాఖ గెజిటెడ్ సంఘం ఉపాధ్యక్షురాలిగా నిర్మల జ్యోతి



ఎంపిక పత్రం అందుకుంటున్న సీడీపీఓ నిర్మల జ్యోతి

కల్లూరు: మహిళా శిశు సంక్షేమశాఖ గెజిటెడ్ మహిళా విభాగానికి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కల్లూరు ప్రాజెక్ట్ అధికారిణి నిర్మల జ్యోతి ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో ఉమ్మడి జిల్లా నుంచి కల్లూరు సీడీపీఓ నిర్మల జ్యోతిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

జీతాల 'పంచాయితీ'



కొణిజర్లలో చెత్తను సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు

- ఐదు నెలలుగా అందని జీతాలు
- పట్టించుకోని అధికారులు
- ఆర్థిక ఇబ్బందుల్లో జీపీ కార్మికులు

కొణిజర్ల: మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీ సామర్థ్యన్ని బట్టి ఒక్కో పంచాయతీలో 5 నుంచి 12 మంది వరకు మల్టీపర్పస్ వర్కర్లు పని చేస్తున్నారు. పంచాయతీ గుమాస్తాలతో పాటు, నీటి సరఫరా చేసేందుకు, గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు, విద్యుత్ దీపాల నిర్వహణ తదితర పనులు నిర్వహిస్తున్నారు.

ఐదునెలలుగా అందని జీతాలు..

అయితే గత ఐదు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు రావడం లేదు. పంచాయతీకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక వర్గాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ వాటా నిలిచి పోయాయి. వీటితో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు కూడా గత ఆరు నెలలుగా రావడం లేదు. దీంతో పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి చెత్త ఎత్తి వేయడానికి ఉపయోగించే ట్రాక్టర్ డీజిల్‌కు కూడా నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకరిద్దరు కార్యదర్శులు తమ సొంత ఖర్చులతో ట్రాక్టర్లు నడిపిస్తున్నారు.

మొదలు పెట్టని పన్నుల వసూళ్లు..

పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేసుకుని వేతనాలకు, ఇతర అవసరాలకు వాడుకునే వెసులుబాటు ఉన్నా పంచాయతీ గుమాస్తాలు ఇంతవరకు పన్నుల వసూళ్లు మొదలు పెట్టలేదు. కొన్ని మేజర్ పంచాయతీలలో గుమాస్తాలు తమకున్న రాజకీయ అండదండలతో పని చేయకుండా ఇతరులపై పనిభారం వేసి కనీసం పన్నుల వసూలు చేసే బాధ్యతలు కూడా విస్మరించి తమ సొంత పనులు చక్కబెట్టుకుంటన్నారు. ఇటీవల జరిగిన బదిలీలలో కార్యదర్శులు కొత్తగా వచ్చిన వారు కావడం పంచాయతీలపై ఇంకా పట్టు లేకపోవడంతో వారు కూడా ఆజమాయిషీ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

> ఉదయం లేచిన దగ్గర నుంచి పడుకునే వరకు పనిచేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో జీపీ కార్మికుల కృషి వెల కట్టలేనిది. పంచాయతీల్లో నిత్యం పారిశుద్ధ్యం నుంచి తాగునీటి సరఫరా, విద్యుత్ లైట్ల పునరుద్ధరణ వంటి పనులు చేస్తున్న కార్మికులకు వేతనాలు అందక కడుపు మాడ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇచ్చేదే అరకొర వేతనాలు అవి కూడా నెలల తరబడి మంజూరు చేయకపోవడంతో పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లు ఇబ్బందుల పాలవుతున్నారు.

నిలిచిన పనులు..

సీనియర్ గుమస్తాలు పంచాయతీ కార్యదర్శులను సైతం బెదిరింపులకు గురి చేసి పనులు చేయకుండా తప్పించుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా వచ్చాం మనకెందుకులే అన్నట్లుగా కార్యదర్శులు మిన్నకుంటున్నారు. కొణిజర్ల పంచాయతీలలో పారిశుద్ధ్య పనులతో పాటు, కార్మికులకు వేతనాలు కూడా నిలిచిపోయాయి. తమ వేతనాలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్‌తో పంచాయతీ కార్మికులు స్వల్పకాలిక సమ్మెలో వెళ్లడానికి నిర్ణయించారు. అధికారులు స్పందించి తక్షణమే వేతనాలకు నిధులు మంజూరు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని పంచాయతీలలో ఈ సమస్య లేదు..

మేజర్ గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేసిన దానిని బట్టి అక్టోబర్ నెల వరకు జీతాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశాము. కొన్ని గ్రామ పంచాయతీల్లోనే ఈ సమస్య ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేవలం జీతాలవరకు మాత్రమే నిధులు వస్తున్నాయి. అవికూడా ప్రస్తుతం రాక పోవడం వల్ల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. పారిశుద్ధ్య ట్రాక్టర్ల ఈఎంఐ లు కట్టడానికి పంచాయతీ ఇంటి పన్నులు నుంచే సర్దుబాటు చేస్తున్నాం. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

– రాజేశ్వరి, ఎంపీఓ, కొణిజర్ల

తక్షణమే మంజూరు చేయాలి..



మండలంలో పంచాయతీ కార్మికులకు ఐదునెలలుగా జీతాలు రావడం లేదు. పంప్ ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు 24 గంటలు పని చేస్తున్నా వేతనాలు మంజూరు చేయడానికి అధికారుల్లో చలనం లేదు. పంచాయతీ కార్యదర్శులను అడిగితే జీపీలో నిధులు లేవు మమల్ని ఏమి చేయమంటారని అంటున్నారు. ప్రభుత్వం ఉన్నతాధికారులు పట్టించుకుని పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు పంచాయతీ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీరుస్తామని హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు.

– సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు

రహదారి నిర్మించాలి



చీమలపాడు-పాపకొల్లు రోడ్డు నిర్మించాలని కోరుతున్న గ్రామస్తులు

కారేపల్లి: మండల పరిధిలోని చీమలపాడు నుంచి పాపకొల్లు వరకు రోడ్డు నిర్మించాలని.. చీమలపాడు గ్రామస్తులు ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. వైరా నియోజకవర్గంలోని సింగరేణి మండలం, జూలూరుపాడు మండలాలు పక్కపక్క సరిహద్దులోనే ఉన్నా.. దట్టమైన అటవీప్రాంతం కావటం, రహదారి సౌకర్యం లేకపోవడంతో రెండు మండలాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సింగరేణి మండలం చీమలపాడు నుంచి.. జూలూరుపాడు మండలం పాపకొల్లు వరకు అటవీప్రాంతంలో 12కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టితే.. ఆయా ప్రాంతాల ప్రజలకు రవాణాసౌకర్యం సులభతరం అవుతుందన్నారు. రోడ్డు నిర్మాణం లేకపోవటంతో ఏన్కూరు మండలం తిమ్మరావుపేట, ఏన్కూరుల మీదుగా సుమారు 40కిలో మీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తుందని ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాలోత్ భావ్‌సింగ్, సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరాలాల్, అజ్మీర వాసు, అజ్మీర ఈర్యా, కళ్యాణ్, నాగులు, రమేష్, చంద్రగిరి నాగన్న, మూడ్ సూర్య, బాసు, బాలాజీ, ధారావత్ సురేష్, బానోత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో సంక్షోభంలో వ్యవసాయం



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరాలో చింత నిప్పు చలపతిరావు అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లను నాశనం చేసి సన్న, చిన్నకారు రైతులను సాగుకు దూరం చేయాలనే కుట్రతోనే కేంద్రం ఏపీఎంసీ చట్టానికి 12 సవరణలు తీసుకొస్తుందన్నారు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లో సరైన ఆయమాయిషీ లేకపోవడం వల్ల అవి మూలన పడుతున్నాయన్నారు. ఇప్పుడు వాటి స్థానంలో ప్రైవేట్ వ్యవసాయ మార్కెట్లు ఏర్పాటు చేయాలని కేంద్రం కుట్ర చేస్తున్నదన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 7,057 ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లలో కనీస సౌకర్యాలు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా పాలక ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వ్యవసాయ రంగ పరిరక్షణకు రైతులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పారుపల్లి కృష్ణారావు, శ్రీనివాసరావు, అమరేంద్ర, శ్రీనాద్, నరసింహాచారి, ప్రసాద్, మధు, పాషా, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తల్లాడలో గ్రీవెన్స్ డే

తల్లాడ: ప్రజా సమస్యలు పరిష్కారం కొరకు తల్లాడ తహసీల్‌లో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎ.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమం తల్లాడలో నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలు ఏమున్నా సంబందిత శాఖాధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

సామాజిక సమస్యలపై ఉపాధ్యాయుడి పోరాటం



గొల్లమండల సురేష్‌ను అభినందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి(ఫైల్)

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయుడు గొల్లమండల సురేష్‌కుమార్ గత ఇరవైఏళ్లుగా సెలవుల్లో సామాజిక సమస్యలపై తనదైన శైలిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. అక్రమ సంబంధాలు, మొక్కలు నాటాలని, మహిళల ఆకృత్యాలు, రోడ్డు ప్రమాదాల గురించి రాసిన అట్టాలను సైకిల్‌కు కట్టుకుని పర్యటించడంతో పాటు.. కరపత్రాలు పంపిణీ చేశాడు. దీంతో ఆయనను జిల్లా అధికారులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు అభినందించారు. అదే విధంగా 1995 నుంచి అనేక వేల మంది చదువుకునే విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వం కోసం, ఆత్మరక్షణ కోసం సుమన్ షోటోఖాన్ కరాటే ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చి అనేక పథకాలు సాధించడంతో 6వ డాన్ అవార్డును 2021వ సంవత్సరంలో సినీ హీరో సుమన్, అకాడమి డైరెక్టర్ జల్లేల శ్రీనివాసరావు నుంచి పొందారు. 2014లో విశాఖపట్నం నందలి ఏపీ స్టేట్ కల్చరల్ సొసైటీ వారు స్టేట్ బెస్ట్ సిటిజెన్ అవార్డును, కల్లూరు మండలం ఉత్తమ సామాజిక సేవా కార్యకర్తగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులను పొందారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ

వైరా: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ అన్నారు. ఆదివారం వైరాలో.. బొంతు సమత అధ్యక్షతన నిర్వహించిన ఐద్వా వైరా పట్టణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జమిలీ ఎన్నికల పేరుతో దేశంలో రాజకీయాధిపత్యాన్ని చెలాయించాలని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. దీనిని ప్రజలు అర్థం చేసుకుని బీజేపీ నాయకుల కుట్రలు తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ, నాయకులు గుడిమెట్ల రజిత, తోట కృష్ణవేణి, బత్తుల ప్రమీల, మల్లికాంబ, కృష్ణకుమారి, సుజాత, విజయ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు..



సీఐ మధు

మధిర: నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలకు అసౌకర్యం, శాంతి భద్రతలకు విఘా తం కల్గిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మధిర సీఐ డి.మధు తెలిపారు. ఆది వారం మధిరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరం మొదటి రోజు ఏ కుటుంబం కూడా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసేందుకు, అతివేగంగా వాహనాలను నడిపేవారు, త్రిబుల్ రైడింగ్ చేసే వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఎవరైనా రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అసౌకర్యం కలిగే విధంగా ప్రవర్తిస్తే వారిపై న్యూసెన్స్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాజీ మృతి తీరని లోటు



షేక్ బాజీ(ఫైల్)

సత్తుపల్లిరూరల్: హమాలీ సంఘం నేత షేక్ బాజీ(52) మృతి చెందటం తీరని లోటని సీఐటీయూ రాష్ట్ర నేత బండి రఘుపతిరెడ్డి అన్నారు. ఆదివారం గుండెపోటుతో బాజీ మృతి చెందారు. ఈయన మృతి పట్ల సీఐటీయూ నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి పాండు, జాజిరి శ్రీనివాసరావులు నివాళులర్పించారు. రావుల రాజబాబు, సైదా వెంకటేశ్వరరావు, బడే మియా, జిలానీ, బుడే, చంద్రం, నవీన్, అర్జున్, రాంబాబు, కోటయ్య, మారేష్, రమేష్ సంతాపం ప్రకటించారు.

ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ సుదర్శనమ్

కల్లూరు: క్రైస్తవులంతా ఐకమత్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ ఎం.సుదర్శనమ్ కోరారు. కల్లూరు ఎస్ఎస్‌పీలోని యూఈఎం చర్చిలో నిర్వహించిన టీసీసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధికి కృషి చేయాలని, పాస్టర్లకు గౌరవ వేతనం అందించాలన్నారు. నిరుపేద క్రైస్తవులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పాస్టర్లకు నూతన సంవత్సరం సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, ముఖ్య సలహాదారులు దేవమందిరం, రాష్ట్ర కన్వీనర్ నిరీక్షణరావు, ఖమ్మంజిల్లా మహిళా అధ్యక్షురాలు జయపాల్, కల్లూరు రెవెన్యూ డివిజన్ మహిళా అధ్యక్షురాలు కరుణమ్మ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ మండలాల అధ్యక్షులు వేణుబాబు, పేతురు, కె ఇస్రాయేలు, పెనుబల్లి కార్యదర్శి డేవిడ్ పాల్, కల్లూరు మండల ప్రేయర్‌సెల్ అధ్యక్షులు జాషువారెడ్డి, రత్నాకర్ పాల్గొన్నారు.

చర్చి పాస్టర్లకు దుస్తుల వితరణ



పాస్టర్లకు దుస్తులు అందించిన దాత పూర్ణచంద్రారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 130మంది చర్చి పాస్టర్లకు నూతన సంవత్సరం సందర్భంగా భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, కేపీఆర్ హోమ్స్ అధినేత యరమల పూర్ణచంద్రారెడ్డి దుస్తులు వితరణ చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని రింగ్ సెంటర్‌లో శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో.. దుస్తులను దాత పూర్ణచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాస్టర్లకు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంచి మనస్సుతో అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం చర్చి ఫాదర్లు దాతను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణ్‌రావు, కడియం శ్రీనివాసరావు, సగ్గుర్తి వెంకటకృష్ణ, ముక్కర సందీప్‌రెడ్డి, కోటపాటి రంగారావు, దేవరకొండ రాజీవ్ గాంధీ, మొగిలి అప్పారావు, షేక్ షాబాష్, కంచర్ల వెంకటనర్సయ్య, శీలం వెంకట్రామిరెడ్డి, దేవరకొండ శ్రీను, గుడేటి బాబురావు, మేరి చెన్నయ్య, బొక్కా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

బ్రహ్మంగారి గుడి నిర్మాణానికి..



రూ.5వేలు నగదు అందిస్తున్న నాగేశ్వరరావు

కారేపల్లి: కారేపల్లిలో నిర్మాణంలో ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంకు ఖమ్మం నగరానికి చెందిన నూతలపాటి నాగేశ్వరరావు రూ.5వేలు నగదును వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాలజ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నిర్మించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పురోహితులు తిరుమలాచార్యులు, దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు తుమ్మోజు రామ్మూర్తి, వేములూరి కోటాచారి, రామాచారి, గుండోజు కృష్ణయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..



ప్రదీప్ కుమార్ కుటుంబానికి నగదు అందిస్తున్న నాయకులు

చింతకాని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ క్లస్టర్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ.. ఇటీవల మృతిచెందిన ప్రదీప్‌కుమార్ కుటుంబానికి కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర, జిల్లా యూనియన్ నాయకులు ఆదివారం రూ.92వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీఈజేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఏలూరి వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు మల్లెల రవీంద్ర ప్రసాద్, ఎంపీడీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు తేళ్లూరి శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ పర్వీన్ కైసర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, తిలక్, కంప్యూటర్ ఆపరేటర్లు సుమంత్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి



మాట్లాడుతున్న నరసింహారావు

కారేపల్లి: మున్నూరుకాపుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలని.. మున్నూరుకాపు సంఘం హడహక్ కమిటీ మండల అధ్యక్షులు గమిడి నరసింహారావు అన్నారు. ఆదివారం కారేపల్లిలోని ఆ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు పగడాల మంజుల నివాసంలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా మున్నూరు కాపులు వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం చొరవచూపాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముత్యాల సురేష్, వాకాటి సురేష్, పొట్లకాయల రమేష్, తేళ్ల శ్రీనివాసరావు, కొప్పెర రంగారావు, పగడాల నాగేశ్వరరావు, వరహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వెంచర్ సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు

కొణిజర్ల: భాగాస్వాములైన తమను వెంచర్ సిబ్బంది బలవంతంగా ఆఫీస్ నుంచి బయటకు నెట్టేసి చంపుతామని బెదిరిస్తున్నారని ఖమ్మం పట్టణానికి చెందిన ముళ్ల కిషోర్‌కుమార్ ఆదివారం కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ముళ్ల కిషోర్ మరికొంత మంది కలిసి కొణిజర్ల సమీపంలో గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్ పేరుతో వెంచర్ వేసి కార్యాలయ భవనాన్ని నిర్మించారు. తర్వాత దానికి ఇతర వ్యక్తులకు డెవలప్‌మెంట్ కోసం ఇవ్వగా వారు.. సదరు కార్యాలయంలో కొంత భాగాన్ని వాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం కిషోర్‌కుమార్, మరి కొంత మంది కలిసి ఆఫీస్‌లో కూర్చుని ఉండగా వెంచర్ సిబ్బంది వచ్చి వారిని బయటకు వెళ్లమని నెట్టడానికి ప్రయత్నించడంతో పాటు.. చంపుతామని బెదిరించారని కిషోర్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సంఘనట తర్వాత కిషోర్ కుమార్ ఆఫీస్ భవనానికి తాళం వేసినట్లు సమాచారం


పేకాట స్థావరంపై దాడి

మధిర: మండల పరిధిలోని మహదేవపురం గ్రామంలోని ఆదివారం మధిర టౌన్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న టౌన్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు సెల్ ఫోన్లు, రూ.1,810 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

కోడిపందేల స్థావరంపై..

పెనుబల్లి: మండల పరిధిలోని పాతకారాయిగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై కె.వెంకటేష్ తన సిబ్బందితో దాడి చేసి 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,150లు, మూడు ద్విచక్రవాహనాలు, రెండు కోడి పుంజులు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారీలో ఉండగా.. వారిని వెతికి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

కురుమ విద్యార్థులకు మెరిట్ అవార్డులు



ఎమ్మెల్సీ మల్లేశం చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రొంటె నవ్య, జిల్లా నాయకులు

కొణిజర్ల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కురుమ విద్యార్థులు చదువుల్లో రాణిస్తున్నందుకుగాను రాష్ట్ర కురుమ సంఘం మెరిట్ అవార్డులు ప్రధానం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని కురుమ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం చేతుల మీదుగా విద్యార్థులు నగదు పురస్కారాలు, మెమొంటోలు అందుకున్నారు. ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 15 బాలబాలికలు అవార్డులకు ఎంపిక కాగా.. వీరిలో కొణిజర్ల మండలం నుంచి రొంటె నవ్య, బండారు త్రిష, లక్ష్మీ చైతన్య, కృష్ణప్రియ, జాన్‌శ్రీ, చింతల హరీష, కృష్ణవేణిలు నగదు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నం మల్లేశం, పగడాల మధు, బండారు కృష్ణ, గోవర్ధన్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.